క్లుప్తంగా

డబుల్ రోడ్డు కోసం సర్వే



సర్వే చేస్తున్న ఏఈ అంజనేశ్వర్

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రా మంలో మంగళవారం డబుల్ రోడ్డు నిర్మించేందుకు ఆర్అండ్బీ ఏఈ అంజనేశ్వర్, సిబ్బంది సర్వే చేపట్టారు. గతంలో కనకాపూర్ నుంచి లక్ష్మణచాంద వరకు డబుల్ రోడ్డు మంజూర వగా.. వడ్యాల్లో పనులు పూర్తి కాలేదు. డబుల్ రోడ్డుతోపాటు ఇరువైపుల డ్రెయినేజీ, బైపాస్ రోడ్డు అభివృద్ధి పనుల కోసం సర్వే చేశారు. అనంతరం అంచనా తయారు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఏఈ తెలిపా రు. ఇందులో నరేశ్రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆవాసంలో వైద్య శిబిరం

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానంద ఆవాసంలో యూపీహెచ్సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. డాక్టర్ కమలేశ్, సిబ్బంది ఉన్నారు.

ఓటీపీలు చెప్పొద్దు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ముధోల్: మండలంలోని బ్రహ్మణ్గావ్ గ్రామంలో మంగళవారం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. గుర్తు తెలియనివారితో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని సూచించారు. బ్యాంకు, ఆధార్ వివరాలను గోప్యంగా ఉంచాలని కోరారు. సిబ్బంది, మహిళలు, రైతులు ఉన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి



పన్ను రుసుం తీసుకుంటున్న కార్యదర్శి

కుంటాల: మండల కేంద్రంలో ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపు సూచించారు. మంగళవారం పన్నులు వసూలు చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో మురికి కాలువలను శుభ్రం చేయించారు.

‘దేవన్న ఆశయాలను నెరవేర్చాలి’

ఖానాపూర్: మాన్క దేవన్న ఆశయాలను విప్లవ పోరాటాల నిర్మాణం ద్వారా నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె. రాజు పిలుపునిచ్చారు. ఖానాపూర్ మండలంలోని పాతఎల్లాపూర్లో మంగళవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు మాన్క దేవన్న వర్ధంతిని ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో హరిత, వెంకట నారాయణ, గోపి నర్సయ్య, సర్దార్, శ్రీనివాస్, లింగన్న, రాజేశ్, గజ్జన్న, ప్రసాద్, స్వామి పాల్గొన్నారు.

‘5న సభను జయప్రదం చేయండి’

నిర్మల్టౌన్: ఉట్నూర్లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఈనెల 5న నిర్వహించే పెన్షన్ ఆక్రోష్ సభను జయప్రదం చేయాలని సీపీఎస్ ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ రద్దు పోరుకు ఉద్యోగులు సిద్ధం కావాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగి పరిస్థితి రిటైర్మెంట్ తర్వాత సరైన పెన్షన్ లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నూతన పింఛను విధానం రద్దు చేసి పాత విధానం పునరుద్ధరించాలని నిర్వహించే ఈ సభకు సీపీఎస్ ఉద్యోగులు తరలి రావాలని కోరారు.

ఎంఈవోకు తప్పని తిప్పలు



సంచులను తీసుకెళ్తున్న ఎంఈవో చంద్రకాంత్

లోకేశ్వరం: పాఠశాలల్లోని విద్యార్థులకు ఉదయం అందించే రాగిజావ, బెల్లం ప్యాకెట్లు మంగళవారం జిల్లా విద్యాశాఖ నుంచి లోకేశ్వరం ఎమ్మార్సీ కార్యాలయం ఆటోలో చేరాయి. అయితే సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది సమ్మెలో ఉండటంతో ఎంఈవో కార్యాలయంలో ఆ సంచులను మోసేందుకు ఎవరూ లేరు. దీంతో ఎంఈవో చంద్రకాంత్ ఒక్కడే అవస్థలు పడుతూ 22 సంచులను మోసుకుంటూ కార్యాలయంలోని ఓ గదిలో భద్రపరిచాడు.

ఎత్తిపోసేది ఎప్పుడో..?

- ఆష్ట గ్రామంలో నిరుపయోగంగా పథకం
- నిర్వహణను పట్టించుకోని వైనం
- ఏళ్లుగా అందని సాగునీరు



ఆష్టలోని ఎత్తిపోతల పథకం

ముధోల్: గోదావరి పరివాహక ప్రాంతంలో బీడు భూములను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎత్తిపోతల పథకం నిర్మాణాలు చేపట్టారు. అవీ ప్రస్తుతం జిల్లాలో కొన్ని పనిచేస్తుండగా.. ముధోల్ మండలంలోని ఆష్ట ఎత్తిపోతల పథకం మాత్రం నిరుపయోగంగా మారింది. 22 ఏళ్ల కిందట రూ.మూడు కోట్లతో ఆష్ట గ్రామంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు సాయంతో ఈ ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఈ పథకం ద్వారా గోదావరి నీటిని పైపులైన్లు ఏర్పాటు చేసి 1500 ఎకరాల ఆయకట్టుకు అందించేలా అక్కడక్కడా కుండీలు నిర్మించారు. కానీ దీని లక్ష్యం మాత్రం ఇప్పటికీ నెరవేరడం లేదు.

ఆది నుంచి సమస్యలే..

15 ఏళ్ల కిందట ఎత్తిపోతల పథకం ద్వారా పైపులైన్ల సాయంతో సమీపంలోని రెండు చెరువులను ఒక్కసారి మాత్రమే నింపారు. మళ్లీ నింపే ప్రయత్నం చేసినప్పటికీ పైపులైన్లకు లీకేజీలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు పైపులైన్లకు మరమ్మతులు చేపట్టనే లేదు. ఏళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్కడున్న సామగ్రి జాడ తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాన్స్ఫార్మర్లు, మోటార్లకు ఐదేళ్ల కిందట మరమ్మతులు చేశారు. తర్వాత వాటి నిర్వహణను గాలికొదిలేశారు. మరోవైపు నీటిని సరఫరా చేసే కుండీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్నా.. తమకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దెబ్బతింటున్న పరికరాలు

ఇటీవల రూ.రెండు కోట్లు మంజూరు..

ఎత్తిపోతల పథకం పైపులైన్లు, యంత్రాలకు మరమ్మతులు చేసి సాగునీటి అందించేందుకు ఇటీవల రూ. 2కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రస్తుతం పనులు చేపడుతున్నారు. సాగునీటిని సరఫరా చేసేందుకు పంట పొలాల్లో 15 కుండీలను నిర్మించారు. ఇంకా పూర్తిస్థాయిలో పైపులైన్ నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఎత్తిపోతల పథకం సందర్శించి.. సంబంధిత అధికారులకు పనులు సూచనలు చేశారు. పనులు వేగవంతం చేసి త్వరగా సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు.



సాగునీటిని అందించే కుండీ

ఒక్కసారి కూడా అందించలేదు



ఆష్ట గ్రామంలో 22 ఏళ్ల కిందట నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా ఒక్కసారి కూడా పంటల సాగుకు నీరందించలేదు. ఇప్పుడైనా సాగునీరందిస్తే పంటలు పండించుకునేందుకు వీలుంటుంది.

– ముస్కు మోహన్రెడ్డి, ఎత్తిపోతల సంఘం చైర్మన్, ఆష్ట

గోదావరిలో నీరున్నా..



మా గ్రామం పక్కనుండే గోదావరి పారుతుంది. కానీ నదిలో నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా మా పంటలకు చుక్క నీరు అందలేదు. అధికారులను అడిగితే రేపు మాపంటూ కాలం వెల్లదీస్తున్నారు.

– సుభాష్రెడ్డి, రైతు, ఆష్ట

త్వరలో రైతులకు నీరందిస్తాం.

ఇటీవల ఎత్తిపోతల పథకం మరమ్మతుల కోసం రూ. 2కోట్లు మంజూరయ్యాయి. పనులను వేగంగా చేస్తున్నాం. నెల రోజుల్లోగా పూర్తి చేసి ఉన్నతాధికారుల సూచనల మేరకు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకుంటాం.

– మధు, నీటిపారుదలశాఖ ఏఈఈ

తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

- మత్తు పదార్థాలకు దూరం ఉండాలి
- సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సాప పండరి



మాట్లాడుతున్న సాప పండరి

లోకేశ్వరం: యువతా మత్తు పదార్థాలకు దూరం ఉంటూ ఉన్నత చదువులతో తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సాప పండరి అన్నారు. మంగళవారం మండలంలోని పుస్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలోని వీధుల్లో మాదక ద్రవ్యాలపై నివారణ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పండరి మాట్లాడుతూ యుక్త వయసులో గంజాయి, సిగరెట్, గుట్కా, తంబాకు తింటే అనారోగ్యం బారిన పడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలను నిర్మూలించి ఆత్మహత్యలను అరికడదామని పిలుపునిచ్చారు. ఓ లక్ష్యం నిర్దేశించుకొని దానిని చేరుకునే పోరాటం చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆ కౌన్సిల్ భైంసా మండల కమిటీ చైర్మన్ బామిని మహేందర్రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చంద్రప్రకాశ్గౌడ్, ఉపాధ్యాయులు రాజశేఖర్, నాగన్న, మధుకర్ ఉన్నారు.

రెండోరోజుకు నిరాహార దీక్ష



గ్లూకోజ్తో శంకర్, పక్కన నాయకులు

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని భర్తీ చేయాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పార్డి(బి)కి చెందిన కొత్త శంకర్ చేస్తున్న నిరాహార దీక్ష రెండోరోజు కొనసాగింది. చైర్మన్ పదవి ఎస్సీలకు కేటాయించినా.. రాజకీయాల కారణంగా ఏడాదిగా ఎవరిని నియమించడం లేదు. చైర్మన్ను నియమించే వరకు దీక్షను విరమించేది లేదని శంకర్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి మార్కెట్ కార్యాలయం ఎదుటే బసచేశారు. మంగళవారం డాక్టర్లు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసి గ్లూకోజ్ పెట్టారు. బీజేపీ నాయకులు ఏశాల దత్తాత్రి, కమ్లేశ్, సంతోష్, మాజీ సర్పంచ్ రమేశ్ తదితరులు సంఘీభావం ప్రకటించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ముధోల్: మండలకేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న చేర్యాల్ చిత్రలేఖనం శిక్షణ తరగతులు మంగళవారం ముగిసినట్లు ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. మాకే సంస్థ ఆధ్వర్యంలో శిక్షకులు ధనాల కోట నాగేశ్వర్.. విద్యార్థులకు చిత్రలేఖనంలో మెళకువలు నేర్పినట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం రాజేందర్, పోతన్న, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

గాయనికి సన్మానం

ముధోల్: మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో తన గానంతో శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేసిన ముధోల్కు చెందిన గడ్పాలే అంజలిని మంగళవారం విశ్వతేజ ట్రెనింగ్ అండ్ కౌన్సిలింగ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సైకాలజిస్టు శ్రీహరి తిరునగరి మాట్లాడుతూ అంజలి తన పాటలతో లక్షలాది మంది మనసులు గెలుచుకుందన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టు మధం మహిపాల్, వాడేకర్ లక్ష్మణ్, విఠల్ కాంబ్లే, బింబిసార్ గడ్పాలే, అంజలి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

శబరిమలై బయలుదేరిన స్వాములు

సోన్: మండలంలోని సిద్దులకుంట గ్రామం నుంచి మంగళవారం పలువురు అయ్యప్పస్వాములు శబరిమలై బయలుదేరారు. స్వామికి ఇష్టమైన ఆవు నెయ్యిని కొబ్బరికాయలో నింపుకొని జనార్దన్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముళ్లు కట్టుకున్నారు. అనంతరం గురుస్వామిని సన్మానించారు.

ముధోల్: మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయంలో అయ్యప్ప స్వాములకు గురుస్వాములు పోతన్నయాదవ్, శ్రీనివాస్చారి ఇరుముళ్లు కట్టి ప్రత్యేక వాహనంలో శబరిమలై సాగనంపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



కల్లూరులో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

కుంటాల:మండలంలోని కల్లూరు, కుంటాల, ఓలా, అంబకంటి, లింబా(కె), అందాకూర్ తదితర గ్రామాల్లో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలను జరుపుకొన్నారు. కల్లూరు వాసవి కళాశాలలో విద్యార్థులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, డైరెక్టర్లు జానకీరాం, కడార్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సేవలు మరువలేనివి



దంపతులను సన్మానిస్తున్న ఆర్డీవో కోమల్రెడ్డి

కుభీర్: రెవెన్యూశాఖలో తహసీల్దార్గా ఎం.సోము అందించిన సేవలు మరువలేనివని భైంసా ఆర్డీవో కోమల్రెడ్డి అన్నారు. మంగళవారం కుభీర్ తహసీల్దార్ ఎం.సోము ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సిబ్బంది ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా ఆర్డీవో హాజరై మాట్లాడారు. మిగతా జీవితాన్ని ఆయురారోగ్యాలతో కుటుంబసభ్యులతో గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీటీ అశోక్కు ఇన్చార్జి తహసీల్దార్ బాధ్యతలు అప్పజెప్పారు. నవీపేట్ తహసీల్దార్ వెంకటరమణ, ముధోల్ తహసీల్దార్ శ్రీకాంత్, నాయకులు నాగేష్, గులాబ్, చంద్రకాంత్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే బొజ్జు పరామర్శ



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రా మానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్ మామ పెద్ద భీమన్న సో లార్ ఫెన్సింగ్ షాక్తో మృతిచెందాడు. మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మస్కాపూర్ వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు చిన్నం సత్యం, కావలి సంతోష్, నిమ్మల రమేశ్, ఎంఏ మాజిద్, జన్నారపు శంకర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థినులు ప్రణాళికతో చదవాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న అధికారి

లోకేశ్వరం: పదోతరగతి విద్యార్థినులు ప్రణాళికతో చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సాలోమి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని కేజీబీవీని ఆమె సందర్శించి మాట్లాడారు. సీఆర్టీలు సమ్మెలో ఉన్నందున విద్యార్థులు క్రమశిక్షణగా మెలగాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట సెక్టోరియల్ అధికారి పద్మ, ఎంఈవో చంద్రకాంత్ ఉన్నారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లావాసుల ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

నిర్మల్టౌన్: కరీంనగర్లోని రీజినల్ స్పోర్ట్స్ పాఠశాలలో డిసెంబర్ 25 నుంచి 31 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో నిర్మల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు పాల్గొన్నారు. డి.ఝాన్సీ బంగారు పతకం, మనీ వెండి, షేక్ అర్మాన్ కాంస్య పతకాలు సాధించారు. వీరిని కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్రెడ్డి, జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్ అభినందించారు.

బుద్ధవిహార్లో వసతులు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

భైంసాటౌన్: పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలో ఉన్న నర్సింహనగర్ బుద్ధవిహార్లో వసతులు కల్పించాలని కౌన్సిలర్ తోట విజయ్ కోరారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ వైస్చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్కు వినతిపత్రం అందించారు. బోరు ఏర్పాటు చేసి ఆవరణ శుభ్రం చేశామన్నారు. బోరు మోటారుతోపాటు వీధిదీపాలు ఏర్పాటు చేయించాలని వినతిపత్రంలో కో రారు. కౌన్సిలర్లు గౌతం పింగ్లే, రాహుల్ దగ్డే ఉన్నారు.

భైంసా పట్టణంలోని రాహుల్నగర్ బుద్ధవిహార్లో బోరుమోటారు ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్ అనిత సూత్రావే కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మాట్లాడారు. బుద్ధ విహార్లో బోరు మోటార్ పని చేయకపోవడంతో దళితులు ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ కమిషనర్ సమస్య పరిష్కరించాలని కోరారు.

ఇళ్ల సర్వేను సత్వరం పూర్తి చేయాలి



భోసిలో పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ సమద్



తర్లపాడ్లో పరిశీలిస్తున్న ఎంపీవో రత్నాకర్రావు

తానూరు: ప్రజాపాలన గ్రామసభల్లో స్వీకరించిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను ఈనెల మూడో తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని భోసి, తానూరు తదితర గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించారు. దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చి సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే మండలంలో 95 శాతం సర్వే పూర్తయినట్లు వెల్లడించారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుంటాల: లబ్ధిదారుల ఎంపికకు మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. సిబ్బంది మంగళవారం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలను సేకరించారు. సర్వేను ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం ఖాన్ పరిశీలించారు.

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆన్లైన్లో పక్కాగా నమోదు చేయాలని ఎంపీవో రత్నాకర్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని తర్లపాడ్లో సర్వేను ఎంపీవో, దిలావార్పూర్లో మండల ప్రజాపరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మదన్మోహన్ పరిశీలించారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం



ఖానాపూర్లో మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం సాదాసీదాగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి, పారిశుద్ధ్య పనులపై సభ్యులు చర్చించారు. పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ పరిమి లత.. చైర్మన్, కమిషనర్ మనోహర్కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు జన్నారపు విజయలక్ష్మి, శంకర్, నాయిని ప్రవంతి సంతోష్, పరిమి లతసురేశ్, కిశోర్నాయక్, ఫౌజియా షబ్బీర్పాషా, కోఆప్షన్ సభ్యులు బండారి కిశోర్, మాలన్ సుల్తాన్, తదితరులు ఉన్నారు.

భైంసాలో రూ.20 లక్షల పనులకు ఆమోదం

భైంసాటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్పర్సన్ సబియా బేగం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. కమిషనర్ రాజేశ్కుమార్ ముందుగా ఎజెండా అంశాలను కౌన్సిల్ సభ్యులకు వివరించగా ఆమోదం తెలిపారు. పలు వార్డుల్లో రూ.20లక్షలతో సీసీ రోడ్లకు మరమ్మతులు, నర్సరీ స్థలం రెన్యూవల్ తదితర అంశాలపై తీర్మానాలకు ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, కౌన్సిలర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. గుంతలతో ముప్పు..



తానూరు: తానూరు నుంచి ధర్మాబాద్ వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. రెండు రోజుల కిందట తానూరు నుంచి ధర్మాబాద్ వెళ్తున్న ఆటో గుంతలు తప్పించే క్రమంలో బోల్తాడింది. జౌలా(బి) గ్రామానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సునీల్, ఆర్అండ్బీ డీఈ, ఫోన్: 84649 60600